క్లుప్తంగా

రూ.45.11 లక్షలకు మార్కెట్ పాట

నరసాపురం: స్థానిక మున్సిపల్ డైలీ మార్కెట్ పన్నుపాట 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి రూ.45.11 లక్షలకు వెళ్లింది. శుక్రవారం కమిషనర్ ఎం.అంజయ్య పర్యవేక్షణలో సీల్డ్‌కమ్ టెండర్లు స్వీకరించిన తరువాత బహిరంగ వేలం నిర్వహించారు. భూపతి సురేష్ పాటను దక్కించుకున్నారు. పాటను ఖరారుకు కౌన్సిల్ అనుమతి కోరతామని కమిషనర్ తెలిపారు.

అయ్యప్పకు పంచామృతాభిషేకం



అయ్యప్పను దర్శించుకుంటున్న స్వాములు

యలమంచిలి: అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పెనుమర్రు అయ్యప్ప దీక్షా మందిరంలో అయ్యప్పకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గణపతి హోమం చేశారు. రాత్రి దీక్షా మందిరంలో పడి పూజ నిర్వహించారు. గురుస్వామి కవురు గోపి ఆధ్వర్యంలో పూజా కైంకర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాకా సూర్యనారాయణ, బర్రే నరసింహస్వామి, చల్లా రామకృష్ణ, పొత్తూరి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక నరసాపురం రోడ్డులో దేవునిహాలు బట్టల మార్కెట్ ప్రాంతంలో ఉభయ గోదావరి జిల్లాల గోవింద మాల కల్యాణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మార్నెళ్ల మాణిక్యాలరావు, దాత సర్వవరపు ఉమామహేశ్వరరావు, బీరక ప్రసాద్, గాధంశెట్టి సతీష్, యాదం రెడ్డి సత్యం, టంగుటూరి నాగేశ్వరరావు, కె.సురేష్, ఉయ్యూరి చిరంజీవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వడలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

పెనుగొండ: వడలి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ కాసాని విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డి గణేశ్వరరావు, ఉప సర్పంచ్ వలపన నరేష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణపతినీడి వెంకట రామారావు, ఉప్పలపాటి చంటి, దొడ్డిపట్ల నాగూరు, రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల నిరసన



నడిపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కూలీలు

పెనుగొండ: ఉపాధి హామీ కూలి బకాయిలు సత్వరం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కమిటీ సభ్యులు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శుక్రవారం పెనుగొండ మండలం నడిపూడిలో ఉపాధి కూలీలతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వేతనం పెంచుతామని భరోసా ఇచ్చినా నేటివరకు పెంచిన వేతనాలు చెల్లించడం లేదని అన్నారు. వేసవి నేపథ్యంలో పని చేసే ప్రాంతంలో టెంట్, మజ్జిగ, ప్రథమ చికిత్స వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

13న ఆక్వా రైతుల సమావేశం

వీరవాసరం: ఉండిలోని కోట్ల ఫంక్షన్ హాలులో ఈ నెల 13వ తేదీన ఆక్వా రైతుల సమావేశం నిర్వహిస్తామని వీరవాసరం మండల రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్ల తులసి రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో రొయ్యల ధరల స్థిరీకరణ, ముడి సరుకులు రేట్లు తగ్గిన మేత రేట్లు తగ్గించకపోవడం, జోన్లకు సంబంధం లేకుండా 1.50 పైసలకే విద్యుత్ సరఫరా చేయడం, 45 రోజులు క్రాప్ హాలిడేపై చర్చిస్తామన్నారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని, రైతుల ఐక్యతను చాటాలని రాంబాబు పిలుపునిచ్చారు.

రేషన్‌లో కందిపప్పు కనికట్టు

- అప్పుడప్పుడు పంచదార సరఫరా
- బియ్యంతోనే సరి
- లబ్ధిదారుల గగ్గోలు



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ హయాంలో రేషన్ సరఫరాలో అమలు చేసిన కందిపప్పు పంపిణీని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. పంచదార అరకొరగా సరఫరా చేస్తూ.. బియ్యం పంపిణీకే రేషన్‌ను పరిమితం చేసింది. దీంతో లబ్ధిదారులు మండుతోన్న ధరలతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేక లబోదిబోమంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోస్తే పేదలకు రేషన్ బియ్యంతోపాటు నిత్యావసర సరుకులనూ సరఫరా చేస్తామని చెప్పి కార్డుదారులను నిండా ముంచారు. రేషన్ బియ్యంతో పాటు ఇతర నిత్యావసరాలు చౌక డిపోల్లో నామమాత్రపు ధరకు దక్కుతాయనుకున్న లబ్ధిదారుల ఆశ నిరాశేగానే మిగిలింది. నరసాపురం రూరల్, అర్బన్‌లలో 41,656 రేషన్ కార్డులు, 2,368 ఏఏవై కార్డులు ఉన్నాయి.

ప్రచారానికే పరిమితం

ఇప్పటికే వంట గ్యాస్ ధర సిలెండర్‌కు రూ.50 పెంచడం పేదలకు భారంగా మారింది. తాము అధికారంలోకి వస్తే క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా వంటివి సరఫరా చేస్తామని కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలును గాలికి వదిలేశారు. దీంతో కూటమి ప్రభుత్వంలో ప్రచారం ఎక్కువ.. పేదలకు సాయం తక్కువ అనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. త్వరలోనే రేషన్ దుకాణాలనూ మూసి వేస్తారేమో అనే ఆందోళన కార్డుదారుల్లో నెలకొంది.

లబ్ధిదారుల నిలదీతలు

నరసాపురం మండలం సరిపల్లి పంచాయతీ పరిధిలోని మార్కెట్‌యార్డు గోదాము నుంచి నియోజకవర్గంలోని అన్ని రేషన్ షాపులకు బియ్యం, పంచదార సరఫరా అవుతున్నాయి. ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయకపోవడంతో ప్రతి రేషన్ షాపుల్లోనూ డీలర్, రేషన్ పంపిణీ వాహన డ్రైవర్‌నూ కార్డుదారులు నిలదీస్తున్నారు. లబ్ధిదారులకు ఏం చెప్పాలో తెలియక అధికారులు, డీలర్లు, వాహన డ్రైవర్లు తల పట్టుకుంటున్నారు. కందిపప్పు, ఇతర నిత్యావసరాలను ప్రభుత్వం సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

కందిపప్పు ఇవ్వాలి



బహిరంగ మార్కెట్లో కిలో కంది పప్పు ధర రూ.100 నుంచి రూ.150 పలుకుతోంది. కూటమి ప్రభుత్వం కంది పప్పును సరఫరా చేయడంలేదు. ఫలితంగా కార్డుదారుల పరిస్థితి కొనలేం.. తినలేం అనే విధంగా తయారైంది. చంద్రబాబు మానవతా దృక్పథంతో పేదలందరికీ కందిపప్పు, వంట నూనెలు రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేయాలి.

– పందూరి ఝాన్సీరాణి, గృహిణి, నరసాపురం

హామీలు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలి. బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. రేషన్ షాపుల్లో కేవలం బియ్యం, అరకొరగా పంచదార సరఫరా చేయడంతో కార్డుదారులకు మింగుడు పడటంలేదు. ప్రభుత్వం వెంటనే రేషన్ దుకాణాల్లో బియ్యంతోపాటు నిత్యావసర సరుకులనూ ప్రతి నెలా క్రమంతప్పకుండా అందించాలి.

– కదలి పెద్దిరాజు, సారవ

ఆహార పదార్థాల పరిశీలన



దేవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యాశాఖ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యురాలు గంజిమాల దేవి అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా పట్టణంలో పలు పాఠశాలలను ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆహారం పదార్థాల రుచి, నాణ్యతపై ఆరా తీశారు. వండిన ఆహారాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపైనా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ ఇ.నారాయణ, ఏడీ సత్యనారాయణ, జిల్లా సివిల్ సప్లయి అధికారిణి సరోజదేవి, ఎంఈఓలు గుమ్మళ్ల వీరాస్వామి, ఆర్‌ఎస్‌వీఎన్ శర్మ, టి.జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎక్సైజ్ స్టేషన్ వద్ద ధర్నా

పాలకొల్లు సెంట్రల్: మండలాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలని కోరుతూ స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద శనివారం కల్లుగీత కార్మికులు నిరసన వ్యక్తం చేయనున్నట్టు కల్లుగీత కార్మికుల సంఘ డివిజన్ కార్యదర్శి బొంతు శ్రీనివాస్ తెలిపారు. బెల్ట్ షాపులు ఎక్కువగా ఉండడం వల్ల కల్లు వ్యాపారం లేక కార్మికులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కల్లుగీత కార్మికులంతా పాల్గొంటారని పేర్కొన్నారు.

చేతుల శుభ్రతతో రోగాలు దూరం



యలమంచిలి : ఏనుగువానిలంకలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హసీనా



పెనుమంట్ర : తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

యలమంచిలి: చేతుల శుభ్రతతో రోగాలు దరిచేరవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అన్నారు. ఏడో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం శుక్రవారం ఏనుగువానిలంక గ్రామంలో నిర్వహించారు. చేతుల శుభ్రత ఆవశ్యకత, మంచి ఆహార అలవాట్లపై హసీనా అవగాహన కల్పించారు. పిల్లలకు బాల్య దశ నుంచే మల విసర్జన తరువాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకునే విధంగా అలవాటు చేయాలన్నారు. పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కిషోర బాలికలు, గర్భిణులు రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగేలా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంద్రాణి, సరోజిని, సీత మహాలక్ష్మి, ఏఎన్ఎం సంధ్య, ఆశ కార్యకర్త కుమారి తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర మండలంలో..

పెనుమంట్ర: అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ పక్షోత్సవాలు సందర్భంగా గురువారం పెనుమంట్ర మండలం పెనుమంట్ర, నత్తారామేశ్వరం, పాలమూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వెయ్యి రోజుల సంరక్షణ, పిల్లలలో పోషకాహార లోపం, కిశోర బాలికల్లో రక్తహీనత అనే అంశాలపై మాట్లాడారు. ఆరోగ్యశాఖ సిబ్బంది కె.భాగ్యకుమారి, ఎన్ సంతోషి, అంగన్‌వాడీ కార్యకర్తలు టీవీఎస్ లక్ష్మి, కె.శాంతి, మంగాయమ్మ, అరుణకుమారి, వెంకటలక్ష్మి, సుజాత, వెంకటరత్నం, సత్యవేణి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

నరసాపురం రూరల్: పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీఓ బి.ఊర్మిళ అన్నారు. శుక్రవారం మొగల్తూరు మండలం కొత్తోట రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించిన పోషన్ పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కిశోరి బాలికలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, కూల్‌డ్రింక్స్, ప్యాకేజ్‌డి ఫుడ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పెరట్లో ఇంటి పంటలను పండించడం ద్వారా ఆరోగ్య కరమైన కూరగాయలు భుజించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, పద్మావతి, విజయకుమారి, శ్రీదేవి, విజయకుమారి, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆదికేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రం విడుదల చేసిన దృశ్యం

నరసాపురం: స్థానిక ప్రసిద్ధ భూదేవి, శ్రీదేవి సమేత ఆదికేశవస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుప్పాల వెంకటకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల వివరాలను శుక్రవారం ఆలయ ఈఓ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. ఈ నెల 22 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు, 23 నుంచి మే 4 వరకు రామానుజాచార్యులు తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని వివరించారు. వచ్చే నెల 5న జరిగే అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు రాత్రి ఉత్సవ మూర్తులను సింహ, శేష, హంస వాహనాలపై ఊరేగింపు ఉంటుందని తెలిపారు. తమిళనాడు పెరంబదూర్ తరువాత రెండోదిగా నరసాపురంలో వెలసిన ఆదికేశవస్వామి ఆలయమన్నారు. సమావేశంలో ఆలయ ఈఓ ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్, ప్రధాన అర్చకుడిఉ పెద్దింటి మోహన్ రామాచార్యులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష నిర్వహణ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

భీమవరం: ఈ నెల 19వ తేదీన నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల నిమిత్తం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. డీఎన్ఆర్ లా కళాశాలలో నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు 37 మంది న్యాయవాదులు, విద్యార్థులు హాజరయ్యారు. జూనియర్ న్యాయవాదులకు, ఫైనల్ లా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ఈ పరీక్షలో ఉత్తమ ఫలితాలు కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపల్ కె.రఘురాం, చెల్లబోయిన రంగారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి యోహాను, ఎం భాస్కర్ రావు, ఎం చిత్రబాను, ఎం కిరణ్ పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే



పాలకొల్లు సెంట్రల్ : కేక్ కట్ చేస్తున్న జయసరిత



పాలకొల్లు సెంట్రల్ : కార్మికులకు మోకు అందిస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్ నాగరాణి



నరసాపురం రూరల్ : పూలేకు నివాళులర్పిస్తున్న పెండ్ర వీరన్న, తదితరులు



నరసాపురం : పూలేకు నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు



పెనుగొండ : పెనుగొండలో పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కులవివక్ష, అంటరానితనంపై పోరాడి, వెనుకబడిన బడుగు బలహీన వర్గాల హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ కర్రా జయసరిత కొనియాడారు. శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. నాయకులు జోగి వెంకటేశ్వరరావు, సాలా నర్సయ్య, మేడిశెట్టి చిట్టిబాబు, కెల్లా పెద్దిరాజు, జోగాడ ఉమామహేశ్వరరావు, వీరా మల్లికార్జునరావు, యినకొండ రవి, కడలి సత్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

పూలేకు మంత్రి, కలెక్టర్ల నివాళి

పాలకొల్లు బస్టాండ్ ప్రాంతంలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది బీసీల్లో చేతి, కులవృత్తుల వారికి మోకులు, కుట్టు మెషీన్లు, తోపుడు బండ్లు అందజేశారు. జిల్లాలోని 400 మంది బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు వర్గాలకు చెందిన లబ్ధిదారులకు రూ.11.50 కోట్ల చెక్కును అందించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ స్థానిక సంస్థలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. కలెక్టర్ సీహెచ్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు చెఅప్పరు. గాంధీబొమ్మల సెంటర్‌లో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగర రామ్మోహన్, ఆర్‌డీఓ దాశి రాజు, బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పూలే ఆశయాలు అనుసరణీయం

నరసాపురం రూరల్: సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయాలు అందరికీ అనుసరణీయమని వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న అన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలోని సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో వీరన్నతో పాటు మరికొందరు నాయకులు పూలే గొప్పతనాన్ని గుర్తుచేశారు. జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, సర్పంచ్ దొండపాటి వెంకట్, పార్టీ నాయకులు పాల రాంబాబు, వంగలపూడి యేసయ్య, నల్లి జయ వరప్రసాద్, కోడెల్లి వెంకటరావు, మాదాసు గోపాలకృష్ణ, తాడి పెద్దిరాజు, వర్ధనపు విజయ్ కుమార్, నల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి

నరసాపురం: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాస్ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నరసాపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా మోకా శంకర్‌ను నియమించారు. నాయకులు అద్దంకి భాస్కర్, రాజులపూటి సుధీర్‌కుమార్, కోలా కనకరాజు, పట్నాల రమేష్ పాల్గొన్నారు.

పూలేకు నివాళి

పెనుగొండ: మహాత్మా జ్యోతీరావ్ పూలేకు పెనుగొండలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఘనంగా నివాళులర్పించారు. పెనుగొండ కంచికామాక్షీ సెంటర్‌లో జ్యోతీరావ్‌పూలే చిత్ర పటానికి పూలమాలవేసి పూలే ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలు పునిచ్చారు. ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, చలుమూరి చంద్రశేఖర్, వేండ్ర రాము, ఉద్దగిరి దత్తు, కూటమి నాయకులు పాల్గొన్నారు. పెనుగొండ పంచాయతీలో సర్పంచ్ శ్యామలాసోనీ శాస్త్రి పూలేకు ఘనంగా నివాళులర్పించారు. ఆచంట మండలం ఆచంట, వల్లూరుల్లో జ్యోతీరావ్ పూలేకు ఘనంగా నివాళులర్పించారు.

పూలే ఆశయాలను సాధిద్దాం

పెనుమంట్ర: జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు కృషిచేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కడలి సుబ్రహ్మణ్యం అన్నారు. మార్టేరు సెంటర్‌లో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు.

రోగులకు పండ్లు పంపిణీ



వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ ఆనందరాజు

పాలకొల్లు సెంట్రల్: హోమియో వైద్యం సృష్టికర్త క్రిస్టియన్ ఫెడ్రిక్ శామ్యూల్ హానిమన్ జయంతిని పురస్కరించుకుని శ్రీ రామకృష్ణ పరమ హంస హాస్పిటల్‌లో శుక్రవారం 125 మంది రోగులకు పండ్లు బహూకరించి, వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశామని హోమియోపతి వైద్యుడు కోసూరి రామకృష్ణ ఆనందరాజు తెలిపారు. అలాగే, పూలపల్లి వృద్ధాశ్రమంలో సీవీఎస్ఆర్, ఎల్ఎన్ చారిటబుల్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి దీర్ఘ కాలిక వ్యాధులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు పంచారామ క్షేత్రంలో చక్రస్నానం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేస్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని నక్షత్రం వనం వద్ద స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానం, త్రిశూల స్నానం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం చేస్తామన్నారు. చక్రస్నానం కారణంగా చండీహోమం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు 27 మంది జంటలతో స్వామివారికి తీపి కావిడలు అందజేత, అనంతరం దండాడింపు, రాత్రి 7 గంటలకు స్వామివార్లకు పుష్పోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

రైల్వే వారోత్సవాలు ప్రారంభం

భీమవరం(ప్రకాశంచౌక్): విజ్ఞాన వేదిక, జంక్షన్ రైల్వే స్టేషన్ ఆధ్వర్యంలో స్టేషన్ హెల్త్ యూనిట్ ప్రాంగణంలో రైల్వే వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. రైల్వే హాస్పిటల్ డాక్టర్ రమేష్, ఎస్ఎం చక్రవర్తి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రైల్వే వ్యవస్థ చాలా గొప్పదని, ఆర్థికపరంగా ఉపాధిపరంగా ఎంతో అభివృద్ధి పథంలో ఉందన్నారు. 33 ఏళ్లుగా స్వచ్ఛంద సంస్థలతో పాటు కలిసి వారోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 16 వరకు రైల్వేశాఖ సహకారంతో వారోత్సవాలు నిర్వహిస్తామని, ముగింపు రోజున డివిజన్ రైల్వే అధికారులకు, ఉత్తమ సేవాతాత్పరులకు సత్కారాలు చేస్తున్నామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

ఆసుపత్రులు, ల్యాబ్‌లకు అనుమతులు తప్పనిసరి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఆంధ్రప్రదేశ్ అల్లోపతిక్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిస్‌మెంట్ చట్టానికి లోబడి పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ జి.గీతాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. స్కానింగ్ సెంటర్లు ఏపీ అల్లోపతిక్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిస్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎటువంటి రిజిస్ట్రేషన్ అనుమతులు లేకుండా ఆసుపత్రులను గాని, క్లినిక్స్, ల్యాబ్‌లను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రుల ఫైర్ అనుమతి పత్రాల గడువు మించితే వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.